క్లుప్తంగా

పదో తరగతి అత్యంత కీలకం



విద్యార్థులతో మాట్లాడుతున్న దయా సాగర్

బిక్కవోలు: విద్యార్థి జీవితంలో పదో తరగతి అత్యంత కీలకమని మోటివేషన్ స్పీకర్, సాఫ్ట్ స్కిల్స్ ట్రైనర్ మహర్షి దయాసాగర్ అన్నారు. ఆయన మంగళవారం మండలంలోని పదో తరగతి విద్యార్థులకు అవగాహన కల్పించారు. పరీక్షలనే భయాన్ని వదిలిపెట్టినప్పుడే విజయానికి బాటలు పడతాయన్నారు. ప్రతి సబ్జెక్టు సంబంధించిన చిట్కాలు వివరించారు. హెచ్ఎం శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాల్లోని 2,500లకు పైగా పాఠశాలలు, కళాశాలల్లో సాగర్ మోటివేషన్ తరగతులు చెప్పారన్నారు.

అన్నసమారాధన



భక్తులకు అన్నం వడ్డిస్తున్న కంబాల శ్రీనివాసరావు

మధురపూడి: కోరుకొండలోని రుక్మిణీ సమేత పాండురంగస్వామి కల్యాణోత్సవాల ముగింపు సందర్భంగా మంగళవారం అన్నసమారాధన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బీజేపీ నాయకుడు, విశ్వహిందూ ధర్మపరిరక్షణ రామసేన అధ్యక్షుడు కంబాల శ్రీనివాసరావు రూ.1,00,000 విరాళంగా అందజేశారు. అనంతరం భక్తులకు అన్న ప్రసాదం వడ్డించారు.

పోర్టిఫైడ్ బియ్యంతో ఆరోగ్యం



బిక్కవోలులో మాట్లాడుతున్న ఎఫ్‌సీఐ అధికారులు

బిక్కవోలు: పోర్టిఫైడ్ బియ్యంతో ఆరోగ్యం చేకూరుతుందని బిక్కవోలు ఎఫ్‌సీఐ డిపో మేనేజర్ సీహెచ్ శ్రీనివాస్ అన్నారు. కాకినాడ డివిజినల్ మేనేజర్ ఆదిపట్ల రెడ్డి శేఖర్ ఆధ్వర్యంలో పోర్టిఫైడ్ బియ్యంపై బిక్కవోలు పంచాయతీ కార్యాలయం వద్ద మంగళవారం అవగాహన కల్పించారు. ఒక కేజీ సాధారణ బియ్యంలో 10 గ్రాముల పోర్టిఫైడ్ రైస్ కలుపుతారన్నారు. వీటిలో విటమిన్లు, సూక్ష్మ పోషకాలు ఉండడంతో రక్తహీనత, నాడి సంబంధిత వ్యాధులు దూరమవుతాయన్నారు. వీటిని చిన్నారులు, బాలింతలు, గర్భిణులు ఎక్కువగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఈగా శ్యామ సుందరరావు, రామకృష్ణ, ఏజెంట్ తోటకూర శ్రీను, పంచాయతీ కార్యాదర్శి రోజా తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై రైతులకు శిక్షణ



శిక్షణలో మాట్లాడుతున్న కేవీకే ప్రధానాధికారి డాక్టర్ నాయుడు

రాజానగరం: కలవచర్లలోని కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే)లో మంగళవారం ప్రకృతి వ్యవసాయంపై శిక్షణ కార్యక్రమం జరిగింది. వరి, మొక్కజొన్న, కూరగాయల సాగులో ప్రకృతి వ్యవసాయ పద్ధతులను అనుసరించడం లాభదాయకమే కాకుండా ఆరోగ్యకరమని కేవీకే ప్రధానాధికారి డాక్టర్ వీఎస్‌జీఆర్ నాయుడు అన్నారు. దానికి అవసరమైన జీవ ఎరువుల తయారీపై అవగాహన కలిగించారు. ఖరీఫ్ సాగుకు ముందుగా వేసుకోవాల్సిన వివిధ రకాల పచ్చిరొట్ట విత్తనాలను వివరించారు. ద్వారకా తిరుమలకు చెందిన గోపాలకృష్ణ అనే ఆదర్శ రైతు ప్రకృతి వ్యవసాయంలో వినియోగించే వివిధ రకాల కషాయాల తయారీని వివరించారు. కార్యక్రమంలో ఏపీసీఎన్ఎఫ్ ప్రాజెక్టు జిల్లా మేనేజర్ బి.తాతారావు, అదనపు జిల్లా మేనేజర్ మహ్మద్‌వలీ, జిల్లాలోని కొవ్వూరు, దేవరపల్లి, చాగల్లు, తాళ్లపూడి, నల్లజర్ల, గోపాలపురం మండలాలకు చెందిన 110 మంది రైతులు పాల్గొన్నారు.

బోరుకు మరమ్మతులు

రంగంపేట: మర్రిపూడి గ్రామంలోని బీసీ కాలనీలో గల తాగునీటి బోరు మరమ్మతులకు గురైంది. ఈ విషయం తెలియడంతో గ్రామ సర్పంచ్ వేము మాధవి.. గ్రామస్తులు ఇబ్బందులు పడకుండా వెంటనే స్పందించి మరమ్మతులు చేపట్టారు. పాడైపోయిన మోటారు స్థానంతో కొత్తదాన్ని ఏర్పాటు చేశారు.

ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం

మధురపూడి: మేధావులను పెద్దల సభలకు పంపించిందేకు విద్యావంతులు, పట్టభద్రులు కృషి చేయాలని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ స్వతంత్ర అభ్యర్థి కాళ్లూరి కృష్ణమోహన్ అన్నారు. ఆయన మంగళవారం కోరుకొండలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా పోస్టర్లను పంపిణీ చేస్తూ, తనకు ఓటు వేయాలని కోరారు.

శివపూజకు వేళాయె..

- మహాశివరాత్రికి ఏర్పాట్లు పూర్తి
- ముస్తాబైన శివాలయాలు
- భక్తులకు ఇబ్బంది లేకుండా వసతులు



రాజానగరంలోని రాజలింగేశ్వరస్వామి, రాజగోపాలస్వామి ఆలయాలు



వంగలపూడి రేవులో భక్తులు సేద తీరడానికి వేసిన టెంట్లు

రాజానగరం: మహాశివరాత్రి సందర్భంగా నియోజకవర్గంలోని శివాలయాలు సర్వాంగ సుందరంగా ముస్తాబయ్యాయి. మామిడి తోరణాలు, పూలదండలు, విద్యుద్దీపాలతో ఎంతో అందంగా అలంకరించారు. బుధవారం తెల్లవారుజామునుంచే భక్తుల రద్దీ ఏర్పడే అవకాశం ఉన్న నేపథ్యంలో పలుచోట్ల బందోబస్తు ఏర్పాట్లు చేశారు. గోదావరికి సమీపంలో ఉండే రాజానగరం, కోరుకొండ, సీతానగరం మండలాలలోని పలు గ్రామాల నుంచి భక్తులు మంగళవారం అర్ధరాత్రి నుంచే పవిత్ర గోదావరి స్నానాలను ఆచరించి, వేకువజాము నుంచే సమీపంలోని శివాలయాలను సందర్శిస్తారు. ఈ నేపథ్యంలో దివాన్ చెరువు, రాజానగరం, ముగ్గళ్ల, మునికూడలి, కోరుకొండ, కునుపూరు, గాదరాడ ఆలయాలకు భక్తుల తాకిడి అధికంగా ఉంటుంది.

300 ఏళ్ల చరిత్ర కలిగిన శివాలయం

రాజానగరంలోని రాజలింగేశ్వరస్వామి, రాజగోపాలస్వామి ఆలయాలను సుమారు 300 సంవత్సరాల క్రితం రాజమహేంద్రవరానికి చెందిన రాజా కాంద్రేగుల జోగిజగన్నాథరావు బహదూర్ పంతులు నిర్మించారు. అలాగే దివాన్ చెరువు ఆగమ ఆశ్రమంలోని కాశీ అన్నపూర్ణ, విశాలాక్షి సమేత కాశీ విశ్వేశ్వరస్వామి, జాతీయ రహదారిని ఆనుకుని నరేంద్రపురం జంక్షన్ వైపు ఉన్న ఈత చెట్టు ఈశ్వరుడు, తూర్పుగానుగూడెం, పల్ల కడియం, నందరాడ, నరేంద్రపురం, జి.యర్రంపాలెం, కానవరం, సంపత్ నగరం గ్రామాల్లోని శైవ ఆలయాల్లో శివరాత్రి వేడుకలు ఘనంగా జరగనున్నాయి.

సీతానగరం మండలంలో..

సీతానగరం: సీతానగరం శివాలయంలోని ఉమా రామలింగేశ్వరస్వామి, ముగ్గళ్లలోని ఉమా కొమరేశ్వరస్వామి, మునికూడలిలోని ఉమా సోమేశ్వర స్వామి ఆలయాలతో పాటు రఘుదేవపురం, కాటవరం, కూనవరం గ్రామాల్లోని శివాలయాలు మహాశివరాత్రికి ముస్తాబయ్యాయి. పురుషోత్తపట్నం, రామచంద్రపురం, వంగలపూడి, సింగవరం, చిన కొండేపూడి, ఇనుగంటివారిపేట, వెదుళ్లపల్లి, బొబ్బిల్లంక, ములకల్లంక, జాలిమూడి, మిర్తిపాడు, ఉండేశ్వరపురం తదితర గ్రామాల్లోని ఆలయాలకు అర్ధరాత్రి నుంచే భక్తుల తాకిడి ఏర్పడనుంది.

పట్టిసీమకు నడక మార్గం సిద్ధం

సీతానగరం: మహాశివరాత్రి సందర్భంగా వంగలపూడి రేవు నుంచి పట్టిసీమ వీరభద్రుడి దర్శనానికి వెళ్లే భక్తుల కోసం గోదావరి పాయపై నడక మార్గం సిద్ధం చేశారు. ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా పలు సౌకర్యాలు కల్పించారు. రేవు నుంచి కిలోమీటరు దూరంలో గోదావరి పాయపై సిమెంట్ తూరలు వేశారు. రేవు వద్ద సైకిల్ స్టాండ్‌ను రూ.66 వేలు, భక్తులను ట్రాక్టర్లపై తరలించడానికి రూ.72 వేలకు బహిరంగ వేలంలో పాటదారులు కైవసం చేసుకున్నారు. సైకిల్ స్టాండ్‌లో



వంగలపూడి రేవులో వైద్యశిబిరాన్ని పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో వెంకటేశ్వరరావు



కనుపూరులోని మల్లికార్జునస్వామి ఆలయం

టూవీలర్లకు రూ.50, కార్లకు రూ.100, ఆటోకు రూ.70 వసూలు చేయనున్నారు. వంగలపూడి నుంచి ఆలయం చేరుకోవాలంటే 10 కిలోమీటర్లు ఉంటుంది. రామచంద్రపురం నుంచి పట్టిసీమ వీరభద్రుని ఆలయం సుమారు మూడు కిలోమీటర్లు ఉంటుంది. అక్కడ భక్తులు వెళ్లడానికి అన్ని ఏర్పాట్లు చేశారు.

ఆధ్యాత్మిక సందడి

మధురపూడి: కోరుకొండ మండలం కనుపూరులోని కొండపై వెలసిన భ్రమరాంబికా సహిత మల్లికార్జునస్వామి 63వ మహాశివరాత్రి ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఈ సందర్భంగా ఆలయాన్ని రంగులతో అందంగా అలంకరించారు. ఇక్కడ ఐదు రోజుల పాటు తీర్థ మహోత్సవాలు జరుగుతాయి. ఆలయానికి వచ్చే భక్తులకు ఇబ్బంది లేకుండా స్థానిక నాయకులు, ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు కంచుమర్తి దుర్గారావు, మత్స్య సహకార సంఘం అధ్యక్షుడు గంధం జోగయ్య ఆధ్వర్యంలో ఏర్పాట్లు పూర్తయ్యాయి.

- బూరుగుపూడిలోని భద్రకాళీ సమేత వీరేశ్వర స్వామి, కాపవరం కాశీ అన్నపూర్ణ సమేత విశ్వేశ్వరస్వామి, బుచ్చెంపేట ఉమా రామలింగేశ్వర స్వామి దేవాలయాల్లో అభిషేకాలు, ప్రత్యేక పూజలు జరుగుతాయి.

వైభవంగా స్వామివార్ల కల్యాణోత్సవం



గౌరీ శంకర ఆలయంలో జరుగుతున్న కల్యాణోత్సవం



కాశీ అన్నపూర్ణ సమేత విశ్వేశ్వరస్వామివారి కల్యాణం

బిక్కవోలు: శివరాత్రిని పురస్కరించుకుని పందలపాక గ్రామంలో కొలువైన గౌరీ శంకరుల కల్యాణం సోమవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. అర్చకుడు గరిమెళ్ల గాంధీ ఆధ్వర్యంలో గ్రామానికి చెందిన పెనగంటి అప్పాజీ, పద్మ దంపతులు కల్యాణ కర్తలుగా వ్యవహరించారు. అదే గ్రామంలోని కాశీ అన్నపూర్ణ సమేత విశ్వేశ్వరస్వామి కల్యాణోత్సవాన్ని కూడా వైభవంగా జరిపారు. అర్చకుడు రమణశర్మ ఆధ్వర్యంలో గ్రామానికి చెందిన సబ్బెళ్ల వీరాఘవరెడ్డి, గంగాభవాని దంపతులు కల్యాణ కర్తలుగా వ్యవహరించారు. పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చి కల్యాణోత్సవాలను తిలకించారు.

వంగలపూడి రేవులో వసతుల పరిశీలన



వంగలపూడి రేవులో ఏర్పాట్లను పరిశీలిస్తున్న అధికారులు

సీతానగరం: మహాశివరాత్రి సందర్భంగా మండలంలోని వంగలపూడి రేవు నుంచి ఏలూరు జిల్లా పట్టిసీమ వీరభద్రుడి దర్శనానికి వెళ్లే భక్తులకు కల్పించే వసతులను ఆర్డీవో కృష్ణ నాయక్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, హౌసింగ్ పీడీ, మహాశివరాత్రి ఉత్సవ స్పెషల్ అధికారి భాస్కర రెడ్డి, డీపీవో వి.శాంతామణి, డీఎల్‌పీవో ఎం.నాగలత, డీఎంహెచ్‌వో డాక్టర్ ఎం.వెంకటేశ్వరరావు మంగళవారం పరిశీలించారు. గోదావరి మధ్యలో ఏర్పాటు చేసిన నడక మార్గంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎ.శ్రీనివాస్, ఎంపీడీవో ఎం.భారతి, ఎస్సై డి.రామ్ కుమార్, ఈవోపీఆర్డీ కేవీఎస్ఎస్ మూర్తి, పంచాయతీ కార్యదర్శి సుజాత పాల్గొన్నారు.

అంతర్రాష్ట్ర యూత్ ప్రోగ్రామ్‌లో షకీనా ప్రతిభ



ప్రశంసాపత్రం అందుకుంటున్న షకీనా గిడియానా

రాజానగరం: గైట్ స్కూల్ ఆఫ్ ఫార్మసీ విద్యార్థిని కె.షకీనా గిడియానా కేరళలోని కొచ్చిన్‌లో నిర్వహించిన అంతర్రాష్ట్ర యూత్ ఎక్స్ఛేంజ్ ప్రోగ్రామ్‌లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి, ప్రశంసలు అందుకుంది. కేంద్ర ప్రభుత్వ యువజన వ్యవహారాలు, క్రీడల వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 17 నుంచి 21 ఈ ఉత్సవాలు జరిగాయి. నెహ్రూ యువ కేంద్రం ద్వారా రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి 28 మంది ఎన్ఎస్ఎస్ వలంటీర్లు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. వీరిలో ఒకరైన షకీనా గిడియానా కేరళ రాష్ట్ర సంస్కృతి, సంప్రదాయాలు, కళలు, వంటకాలను తెలుసుకోవడంతో పాటు కళరియపట్టు మార్షల్ ఆర్ట్స్ కూడా నేర్చుకుందని ప్రిన్సిపాల్ డాక్టర్ ఎండీ ధనరాజ్ తెలిపారు. మేతో కార్యక్రమాల ద్వారా మాదక ద్రవ్యాల నివారణ, ఆరోగ్యం, ఆహార భద్రత విషయాలపై అవగాహన పెంచుకుందన్నారు. పలు పర్యాటక ప్రదేశాలు, మ్యూజియమ్స్, వాటర్ మెట్రో, మెరైన్ డ్రైవ్, కొచ్చిన్ పోర్టులను సందర్శించడంతో పాటు 12 కిలోమీటర్లు ట్రెకింగ్ చేసిందని తెలిపారు. దీంతో కేరళ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ చైర్మన్ ప్రొఫెసర్ రాధాకృష్ణ చేతుల మీదుగా ప్రశంసాపత్రం అందుకుందని వెల్లడించారు. ఈ సందర్భంగా షకీనాకు అధ్యాపకులు, సహ విద్యార్థులు అభినందనలు తెలిపారు.

సస్యరక్షణ చర్యలతో మంచి దిగుబడులు



శ్రీకృష్ణపట్నంలో జీడిమామిడి తోటలను పరిశీలిస్తున్న శాస్త్రవేత్త నరసింహారావు

రాజానగరం: ప్రస్తుత సీజన్‌లో పూత, పిందె దశలలో జీడిమామిడి తోటలు ఆరోగ్యకరంగా ఉన్నాయని దివాన్ చెరువులోని జిల్లా ఏరువాక కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ చల్లా వెంకట నరసింహారావు అన్నారు. ఈ సమయంలో కొద్దిపాటి సస్యరక్షణ చర్యలు చేపడితే మంచి దిగుబడులను పొందవచ్చన్నారు. క్షేత్ర సందర్శనలో భాగంగా శ్రీకృష్ణపట్నంలోని జీడిమామిడి తోటలను మంగళవారం సందర్శించి, రైతులకు కొన్ని సూచనలు చేశారు. గత ఏడాది చీడపీడలతో దిగుబడులు పడిపోయి రైతులు తీవ్రంగా నష్టపోయారని, అయితే ఈ ఏడాది అటువంటి పరిస్థితులు ఉత్పన్నం కాకపోవచ్చనే ఆశాభావం వ్యక్తం చేశారు. కొన్ని ప్రాంతాలలో టీ దోమ కారణంగా చిగుళ్లు ఊదారంగులోకి మారుతున్నట్టు గుర్తించామన్నారు. ఈ తెగులు నివారణకు తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. మోనోక్రోటోఫాస్ 1.6 మిల్లీలీటర్‌ను ఒక లీటరు నీటిలో కలిపి చిగురు వేసే సమయంలో పిచికారీ చేయాలన్నారు. పూత వచ్చిన తర్వాత క్లోరీపైరీఫాస్ 2.5 మిల్లీలీటర్లు, గింజలు బఠానీ సైజులో ఉన్న సమయంలో ప్రొఫెనోఫాస్ 2 మిల్లీలీటర్లను ఒక లీటరు నీటిలో కలిపి చల్లాలన్నారు. ఆకు మచ్చ తెగులు నివారణకు లీటరు నీటిలో ఒక గ్రామ్ కార్బెండిజమ్ కలిపి స్ప్రే చేయాలన్నారు. ఆయన వెంట మండల వ్యవసాయాధికారి ఎస్‌కే ఇమామి ఖాసిమ్, రైతులు ఉన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల అభివృద్ధికి కృషి



పెదపూడిలో శిక్షణ పొందుతున్న అంగన్‌వాడీ కార్యకర్తలు



బిక్కవోలులో అంగన్‌వాడీలు తయారీ చేసిన విద్యా సామగ్రి



సీతానగరం హైస్కూల్లో మాట్లాడుతున్న ఎంఈవో స్వామి నాయక్

పెదపూడి: అంగన్‌వాడీ పిల్లలకు మెరుగైన ప్రీ ప్రైమరీ విద్యను అందించి, కేంద్రాల అభివృద్ధికి కృషి చేయాలని కార్యకర్తలకు మండల విద్యాశాఖాధికారి-2 సీవీవీ సత్యనారాయణ సూచించారు. పెదపూడి గాంధీ మెమోరియల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో అంగన్‌వాడీ కార్యకర్తలకు ఇస్తున్న జ్ఞానజ్యోతి 120 రోజుల సర్టిఫికెట్ కోర్సులో భాగంగా ఆరో రోజు మంగళవారంతో శిక్షణ తరగతులు ముగిశాయి. కార్యక్రమంలో ఎంఈఓ-1 కె.సత్యనారాయణ, డీఆర్పీలు సాయి వెంకటేష్, ఏఎస్ఎన్ లోవరాజు, ఆర్.శ్రీనివాస్, వై.శ్రీగౌరీ, సీహెచ్. శ్రీపద్మ పాల్గొన్నారు.

బిక్కవోలు: మండలంలోని అంగన్‌వాడీ సిబ్బందికి జ్ఞానజ్యోతి శిక్షణ ముగిసింది. ఈ సందర్భంగా బిక్కవోలు ఉన్నత పాఠశాల వద్ద ఎంఈవో- 1 సీహెచ్ సత్యనారాయణ మాట్లాడుతూ ప్రీ ప్రైమరీ స్కూళ్లుగా మారబోతున్న అంగన్‌వాడీ కేంద్రాల్లో మూడు నుంచి ఐదేళ్ల వయసున్న చిన్నారులకు ఆటపాటలతో కూడిన చదువులు అందించడం ఈ శిక్షణ లక్ష్యమన్నారు. అలాగే ఊలపల్లి ఉన్నత పాఠశాల వద్ద ఎంఈవో - 2 పూర్ణచంద్రరావు మాట్లాడుతూ చిన్నారులు చదవడం, రాయడం, ఇతరులతో సంభాషించడం, భాషను అభివృద్ధి చేసుకోవడం నేర్చుకుంటారన్నారు. అనంతరం శిక్షణలో తయారు చేసిన సామగ్రిని ప్రదర్శించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్ వైజర్లు బిక్కవోలు కృష్ణకుమారి, ఊలపల్లి శాంతి రత్నకుమారి, బిక్కవోలు ఉన్నత పాఠశాల హెచ్ఎం పళ్లా ప్రభాకర్, ఊలపల్లి ఉన్నత పాఠశాల హెచ్ఎం కొవ్వూరి అమ్మిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీతానగరం: స్థానిక ప్రభుత్వ హైస్కూల్లో అంగన్‌వాడీ కార్యకర్తలకు ఇస్తున్న జ్ఞానజ్యోతి శిక్షణ కార్యక్రమాలు ముగిశాయి. కార్యక్రమంలో కోర్సు కోఆర్డినేటర్, ఎంఈవో కె.స్వామి నాయక్, డీఆర్పీలుగా వ్యవహరిస్తున్న ఉపాధ్యాయులు కేఎల్ మనోహర్, బేగం, వెంకటేశ్వరరావు, ఐసీడీఎస్‌ను సూపర్‌వైజర్లు వరలక్ష్మి, భారతి పాల్గొన్నారు.

ఘనంగా శివరాత్రి ఉత్సవాలు ప్రారంభం



రంగంపేటలోని ఉమా రామలింగేశ్వరస్వామి దేవాలయం



ఉమా రామలింగేశ్వర స్వామివారు

రంగంపేట: మండల కేంద్రమైన రంగంపేటలో 160 ఏళ్ల చరిత్ర కలిగిన ఉమా రామలింగేశ్వర, బాల సుబ్రహ్మణ్యేశ్వరస్వామి వార్ల దేవాలయాల్లో మహాశివరాత్రి ఉత్సవాలు మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. గత 28 సంవత్సరాలుగా నిర్వహిస్తున్న ఉత్సవాలు ఈ ఏడాది మరింత ఘనంగా చేయడానికి ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు భారీ ఏర్పాట్లు చేశారు. దానిలో భాగంగా ఆలయం వద్ద మంగళవారం సాయంత్రం 6 గంటల నుంచి స్వామి వారికి విఘ్నేశ్వర పూజ, ధ్వజారోహణ, అంకురార్పణ, హోమం, నీరాజన మంత్ర పుష్పం నిర్వహించారు. బుధవారం తెల్లవారు జామునుంచి స్వామివారికి అభిషేకాలతో పూజా కార్యక్రమాలు ప్రారంభిస్తారు. ఆలయ ప్రాంగణంలోని వేదికపై ఉదయం 8 నుంచి దేవీబాలభక్త బృందంచే భజనలు, సాయంత్రం 6 గంటలకు స్వామివారికి హారతులు, అనంతరం తెల్లవార్లూ నువ్వుల నూనెతో 1008 దీపాలతో సహస్ర దీపారాధన జరుగుతుంది. రాత్రికి బొబ్బిలియుద్ధం బుర్రకథ, సంగీత విభావరి, సుందర వ్యాసాలు, శాస్త్రీయ నృత్య ప్రదర్శన, సాంస్కృతిక కార్యక్రమాలు, లింగోద్భవ కాలంలో స్వామి వారికి అభిషేకాలు నిర్వహించనున్నారు. అనంతరం వైభవంగా స్వామి వారి కల్యాణం జరుపుతారు. గురువారం ఉదయం 10 గంటల నుంచి స్వామి, అమ్మవార్ల గ్రామోత్సవం కన్నుల పండువగా జరుగుతుంది. రాత్రి 5 గంటలకు పూర్ణాహుతి, శ్రీపుష్పయాగం చేస్తారు.

కాశీలో దారి తప్పిన వృద్ధుడు

- ముమ్మరంగా గాలించిన కుటుంబ సభ్యులు
- సహకారం అందించిన జిల్లా ఎస్పీ
- ఐదు రోజుల తర్వాత కనిపించిన వైనం



పోతురాజుతో అతడి కుమారుడు శ్రీను, స్నేహితుడు

రాజానగరం: కాశీలో తప్పిపోయిన వృద్ధుడు క్షేమంగా కుటుంబ సభ్యుల చెంతకు చేరాడు. జిల్లా ఎస్పీ నరసింహ కిశోర్ ద్వారా ఉత్తరప్రదేశ్ పోలీసుల సహకారంతో ఐదు రోజుల అనంతరం క్షేమంగా కనిపించాడు. వివరాల్లోకి వెళితే. రాజానగరం మండలం పుణ్యక్షేత్రానికి చెందిన పేపకాయల పోతురాజు (68,) కుటుంబ సభ్యులతో కలిసి వారం రోజుల క్రితం కాశీకి వెళ్లాడు. అక్కడ క్షేత్రాలను సందర్శిస్తున్న సమయంలో పోతురాజు దారి తప్పాడు. కొద్దిసేపటికి ఈ విషయాన్ని గమనించిన కుటుంబ సభ్యులు కంగారుగా ఆ పరిసరాల్లో గాలించారు. కానీ ఎక్కడా అతడి ఆచూకీ దొరకలేదు. దీంతో పోతురాజు కుమారుడు శ్రీను, స్నేహితుల సహకారంతో ఈ విషయాన్ని జిల్లా పోలీసులకు చేరవేశాడు. ఎస్పీ నరసింహ కిశోర్ వెంటనే స్పందించి, ఏపీ ప్రభుత్వం ద్వారా వారణాశిలోని పోలీసు కమిషనరేట్ సహకారం తీసుకుని, గాలింపును తీవ్రతరం చేశారు. ఎట్టకేలకు పోతురాజు కనిపించడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. అనంతరం సంతోషంగా పుణ్యక్షేత్రంలోని ఇంటికి మంగళవారం చేరుకున్నారు. తన తండ్రి ఆచూకీని కనుగొనడంతో సహకరించిన జిల్లా ఎస్పీ నరసింహ కిశోర్, వారణాశి పోలీసులకు శ్రీను కృతజ్ఞతలు తెలిపారు.

రేపు వైద్యశిబిరం

సీతానగరం: ఇనుగంటివారిపేటలోని ద్వారకామాయి ఫంక్షన్ హాల్లో గురువారం దంత వైద్యశిబిరం నిర్వహిస్తామని శ్రీసాయి సేవాసమితి ఇనుగంటివారిపేట చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ సత్యం లక్ష్మి తెలిపారు. ఆమె మంగళవారం మాట్లాడుతూ షిర్డీ సాయిబాబా మందిరం 17వ వార్షికోత్సవం సందర్భంగా ఆరోజు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ శిబిరం జరుగుతుందన్నారు. లయన్స్ క్లబ్ ఆఫ్ రాజమండ్రి సెంటెన్నియల్ పవర్ ఆధ్వర్యంలో రాజమహేంద్రవరంలోని గంగా ఎమర్జెన్సీ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ వైద్యులు పీఎస్‌వీటీఆర్‌కే పరమహంస షుగర్, బీపీ, ఇతర వ్యాధులకు వైద్యం అందిస్తారన్నారు. ఎల్‌వీ ప్రసాద్ నేత్ర వైద్య విజ్ఞాన సంస్థకు అనుబంధంగా ఉన్న జగ్గంపేటలోని శ్రీమతి రాజరాజేశ్వరి రామకృష్ణన్ లయన్స్ వైద్యశాల ఆధ్వర్యంలో కంటి పరీక్షలు జరుగుతాయన్నారు.

త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం



ప్రచారం చేస్తున్న ప్రబోధ సేవా సమితి సభ్యులు

రాజానగరం: ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరులు రచించిన త్రైత సిద్ధాంత భగవద్గీతతో పాటు అనుబంధ గ్రంథాలపై రాజానగరం న్యూసిటీ కాలనీలో మంగళవారం ప్రచారం నిర్వహించారు. రాజమహేంద్రవరానికి చెందిన త్రైత సిద్ధాంత ప్రబోధ ప్రబోధ సేవా సమితి, ఇందూ జ్ఞాన వేదిక అధ్యక్షుడు శేఖర్ బాబు ఆధ్వర్యంలో జరిగిన ఈ ప్రచారంలో సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

తాళం వేసిన ఇంటిలో చోరీ

రాజానగరం: కొంతమూరులో తాళం వేసి ఉన్న ఇంటిలో దొంగలు పడి 10 గ్రాముల బంగారంతో పాటు టీవీని అపహరించుకుపోయారు. ఎస్సై మనోహర్ తెలిపిన వివరాల ప్రకారం.. కొంతమూరుకు చెందిన ఏలూరి సూర్యప్రకాష్‌రాజు (65) తన ఇంటికి తాళం వేసి, కుటుంబ సభ్యులతో కలిసి కుంభమేళాకు వెళ్లారు. అక్కడి నుంచి మంగళవారం తిరిగి వచ్చే సరికీ ఇంటికి వేసిన తాళం బద్దలు కొట్టి ఉంది. లోపలకు వెళ్లి పరిశీలించగా 10 గ్రాముల బంగారం, టీవీ మాయమయ్యాయి. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మూడు వారాలలో రబీ వరి కోతలు

రాజానగరం: వరి సాగులో అందరికంటే ముందుండే మెట్ట ప్రాంతంలోని నరేంద్రపురం, వెలుగుబంద, తూర్పుగానుగూడెం, రాజానగరంలలో రబీ వరి పంట కోతలు మరో మూడు వారాలలో ప్రారంభమవుతాయని మండల వ్యవసాయాధికారి షేక్ ఇమామి ఖాసిమ్ తెలిపారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా వెలుగుబంద, రాజానగరంలలో మంగళవారం వరి పంట క్షేత్రాలను సందర్శించి, రైతులతో సమావేశమయ్యారు. వరిలో తక్కువ కాల వ్యవధితో కూడిన సన్న రకం వండగాలను సాగు చేయడం వలన కోతలకు సిద్ధమవుతున్నాయన్నారు. అంతేకాక పెద్దగా చీడపీడల బెడద లేదన్నారు. అయితే కొన్నిచోట్ల కంకినల్లి ఆశించి, వరి గింజలు ఎరుపు రంగులోకి మారడం గమనించామన్నారు. దీని నివారణకు స్పైరోమెసిఫెన్ 1.0 ఎంఎల్‌ను ఒక లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలని సూచించారు. వ్యవసాయ గ్రామ విస్తరణాధికారులు శిరీష, మనస్వి, రైతులు పాల్గొన్నారు.